## క్లుప్తంగా

### అర్హులను ఓటర్లుగా నమోదు చేయించండి



మాట్లాడుతున్న తహసీల్దార్ సత్యానందం

రామాపురం : 18 సంవత్సరాలు నిండిన యువతీయువకులకు ఓటు హక్కును కల్పించాలని తహసీల్దార్ సత్యానందం పేర్కొన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బూత్ లెవెల్ అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేడు బుధవారం జనవరి 25న బీఎల్ఓలు ఆయా కేంద్రాల వద్ద ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉండి 18 సంవత్సరాలు నిండిన యువతీయువకులను గుర్తించి ఓటు హక్కు నమోదు చేయించాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి గెలుపొందిన విజేతలకు బహుమతులు అందించాలన్నారు. పోలింగ్ కేంద్రం పరిధిలోని సీనియర్ ఓటర్లను గుర్తించి సన్మానించాలన్నారు. కార్యక్రమంలో డీటీ అరవింద్ కిషోర్, ఆర్ఐ శివశంకర్, వీఆర్ఓలు, బీఎల్ఓలు పాల్గొన్నారు.

### జాతీయ స్థాయి అథెటిక్స్‌కు గురుకులం విద్యార్థిని



విద్యార్థిని వందనతో పీడీ రత్నకుమారి

రాయచోటి టౌన్ : జాతీయ స్థాయి అథెటిక్స్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న ఆర్.వందన అనే విద్యార్థిని జాతీయ స్థాయి అథెటిక్స్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ బేబీ కరుణ తెలిపారు. మంగళవారం శ్రీకాకుళంలో జరిగిన రాష్ట్ర స్థాయి అథెటిక్స్ పోటీలు నిర్వహించగా తమ విద్యార్థిని ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించిందని చెప్పారు. ఆ విద్యార్థిని ఉత్తమ ప్రదర్శనకు తమ కళాశాలలోని పీడీ రత్నకుమారి సహకరించారన్నారు.

### జయప్రదం చేయండి



కరపత్రాలను విడుదల చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నేతలు

రాయచోటి అర్బన్ : ఏఐఎస్ఎఫ్ అన్నమయ్య జిల్లా ప్రథమ మహాసభలను జయప్రదం చేయాలని ఆసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లవకుమార్, కోటేశ్వరరావులు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు ఫిబ్రవరిలో నిర్వహించే మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఏఐఎస్ఎఫ్ ఎనలేని పోరాటాలు చేస్తోందన్నారు. ఫిబ్రవరి 16,17,18 తేదీల్లో పట్టణంలో జరిగే మహాసభల్లో విద్యారంగ సమస్యలపై చర్చిస్తామన్నారు. మహాసభలకు జిల్లాలోని విద్యార్థులందరూ హాజరై విజయవంతం చేయాలంటూ కోరారు. ఏఐఎస్ఎఫ్ నేతలు రవీంద్ర, మణికంఠ, నారాయణ, మధు, ధనుంజయ పాల్గొన్నారు.

### పీఎంజేజేబీవైను సద్వినియోగం చేసుకోండి

పుల్లంపేట : ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా పథకాన్ని అర్హులైన ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని పుల్లంపేట ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్ అన్నారు. ఆర్.గొల్లపల్లికి చెందిన ఎస్.రంగనాథ్ అనే ఖాతాదారుడు ఇటీవల మరణించడంతో ఆయన సతీమణికి ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకం కింద రూ. 2 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి జీవనజ్యోతి భీమా యోజన పథకాన్ని అర్హులైన ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 50 సంవత్సరాలలోపు వయస్సు ఉన్న ఖాతాదారులు ఈ పథకానికి అర్హులని తెలిపారు. ఫీల్డ్ ఆఫీసర్ విజయ్, శశికళ, ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.

### నివాళి

చిట్వేలి : కెఎస్ అగ్రహారం హరిజనవాడకు చెందిన శెట్టిపల్లి శివయ్య సోమవారం మంగంపేటలోని పల్వరైజింగ్ మిల్లులో విధులు నిర్వహిస్తూ ప్రమాదవశాత్తు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రైల్వేకోడూరు ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు మంగళవారం మండల వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి మంగళవారం శివయ్య మృతదేహానికి నివాళులర్పించారు.

### సచివాలయాల తనిఖీ

పెనగలూరు : మండలంలోని పలు సచివాలయాలను జెడ్పీటీసీ సభ్యుడు ఉదయగిరి సుబ్బరాయుడు తనిఖీ చేశారు. అనంతంపల్లి, ముద్రపల్లి, కట్టావారిపల్లి సచివాలయాల్లోని సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమై పలు సమస్యలపై చర్చించారు. అలాగే కట్టావారిపల్లిలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి ఏజెన్సీలకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో కట్టావారిపల్లె సర్పంచ్ శివయ్యనాయుడు, ఎన్ఆర్ పురం మాజీ సర్పంచ్ శంకరయ్య, కట్టావారిపల్లి సచివాలయ కన్వీనర్ కె.నరసయ్య నాయుడు, పల్లంపాడు మహేష్, కట్టావారిపల్లె వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు
- వివిధ ప్రాంతాల్లో బాలికల దినోత్సవం సందర్భంగా ర్యాలీలు, సదస్సులు



ఓబులవారిపల్లె: బహుమతులు అందజేస్తున్న దృశ్యం



రైల్వేకోడూరు: మెడికల్ కిట్లు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు



లక్కిరెడ్డిపల్లె: కోనంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రైల్వేకోడూరు : మహిళలు ఆర్థిక, సామాజిక, రాజకీయ తదితర అన్ని రంగాల్లోనూ రాణించాలని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళ సృష్టి అనేది అద్భుతం అని పేర్కొన్నారు. బాధ్యతలు నిర్వర్తించడంలో వారికి వారే సాటి అని చెప్పారు. సమాజంలోని ఆడపిల్లలపై ఉన్న అసమానతలను దూరం చేసేలా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాలు తోడ్పాటునిస్తాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం బాలికలకు ఉండే హక్కులు, విద్య, ఆరోగ్యం, పోషకాహారం అంశాలలో మహిళలకు పెద్దపీట వేస్తున్నారన్నారు. మహిళలకు రక్షణ కల్పించేందుకే జగనన్న ప్రభుత్వం దిశ యాప్ ప్రవేశపెట్టారన్నారు. అనంతరం ఐసీడీఎస్ కార్యాలయంలో మొక్కలు నాటి, అంగన్‌వాడీ కార్యకర్తలకు మెడికల్ కిట్లను, శానిటైజర్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, జెడ్పీటీసీ రత్నమ్మ, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, ఉప సర్పంచ్ తోట సాయి, పట్టణ అధ్యక్షులు సిహెచ్.రమేష్, ఎంపీడీవో నాగార్జున, సీడీపీవో రాజేశ్వరి, సూపర్‌వైజర్లు అనసూయ, మనెమ్మ, గుణవతి, రత్నమ్మ, నిర్మల, జయలక్ష్మి, సుబ్బలక్ష్మి, యశోద, మాధవి, శ్యామల సుధామణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

**ఓబులవారిపల్లెలో..**

ఓబులవారిపల్లె : ఆడపిల్లలేని ఇల్లు, చందమామ లేని ఆకాశం ఒకటేనని శ్రీ రిషీ అప్పర్ ప్రైమరీ పాఠశాల కరస్పాండెంట్ టి.యువరాజ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పాఠశాలలో బాలికల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు ఎన్ఆర్ఐ కువైట్ దూదేకుల సంఘం కోశాధికారి ఉరిమిల్ల మస్తాన్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెడ్ టీచర్ దామోదర్ వల్లి, దూదేకుల సంఘం నాయకులు గుండ్లూరు కరిముల్లా, అమిత్ అహ్మద్, మస్తాన్, జహీర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

**ఆడపిల్లల చదువుతో గృహం నందనవనం**

రాజంపేట రూరల్ : ఆడపిల్లలు చదువుకోవడం వలన గృహం నందనవనమవుతుందని ఆకేపాడు ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ కె.రాణెమ్మ అభిప్రాయపడ్డారు. మండల పరిధిలోని ఆకేపాడులోని అంగనవాడీ కేంద్రంలో మంగళవారం జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు ఆడపిల్లల పెంపుదలపై అవగాహన కల్పించారు. ఆడపిల్లలు చదవడం వలన అటు సమాజానికి ఇటు గృహాభివృద్ధికి కలిగే ప్రయోజనాలను వివరించారు. నేటి ఆడపిల్లలే రేపటి మహిళామణులని కొనియాడారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం భారతి, ఆకేపాడులోని పలు అంగనవాడీ కేంద్రాల కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

**ఆడపిల్లలను చదివిద్దాం**

పెనగలూరు : ఆడపిల్లలను చదివించి ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లే బాధ్యత తల్లిదండ్రులపై ఉందని అంగన్‌వాడీ కార్యకర్త గంగాధరమ్మ అన్నారు. మంగళవారం చక్రంపేట, నల్లపరెడ్డిపల్లి పంచాయతీ పరిధిలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీధులలో బాలికలతో ర్యాలీ నిర్వహించారు.

**కట్టావారిపల్లెలో..**

జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా కట్టావారిపల్లె జిల్లాపరిషత్ హైస్కూల్‌లో విద్యార్థునులతో ప్రధానోపాధ్యాయుడు గోపాలకృష్ణ బేటీ బచావో భేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

**లింగ వివక్ష నుండి ఆడపిల్లలను కాపాడుదాం**

లక్కిరెడ్డిపల్లె : మగ, ఆడా అనే తేడా లేకుండా పిల్లలను పెంచాలని కోనంపేట వైద్యాధికారి సిద్దయ్య పేర్కొన్నారు. జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం కోనంపేట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులచే బేటీ పడావో బేటీ బచావో కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సిద్దయ్య మాట్లాడుతూ ఆడపిల్లలను బాగా చదివిస్తే దేశానికి ఉపయోగపడతారన్నారు. వారిని బాగా చదివించి మంచి భవిష్యత్తు అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సుబ్బరాయుడు, సీహెచ్ఓ రవీంద్ర, రామచంద్ర, ఏఎన్ఎంలు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఆడపిల్లలను చదివించకుండా బాల్య వివాహాలు చేస్తే ఆ తల్లిదండ్రులపైన కఠిన చర్యలు తప్పవని సీడీపీఓ పద్మావతి పేర్కొన్నారు. జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం స్థానిక కస్తూర్బా గురుకుల పాఠశాలలో బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లింగ వివక్ష చూపకుండా ఆడపిల్లలను ఉన్నత చదువులు చదివించాలని కోరారు. ఎస్ఐ వినోద్ కుమార్ మాట్లాడుతూ మైనర్ బాలికలకు వివాహం చేస్తే చట్టరీత్యా నేరమని, అలా చేసిన తల్లిదండ్రులపైన కేసు నమోదు చేస్తామన్నారు.

**ఇంటికి ఆసరా ఆడపిల్ల**

పుల్లంపేట : ఆడపిల్లలు ఇంటికి అందమే కాదు ఆసరా కూడా అని సూపర్‌వైజర్ మణెమ్మ కొనియాడారు. మండల పరిధిలోని పాపక్కగారిపల్లిలో అంగనవాడీ కేంద్రంలో కార్యకర్త ఆకేపాటి కళావతి ఆధ్వర్యంలో బేటి బచావో-బేటి పడావో కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఆడపిల్లలను భారంగా భావించవద్దని బాధ్యతగా భావించాలని మణెమ్మ కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



పెనగలూరు: చక్రంపేటలో ర్యాలీ చేస్తున్న దృశ్యం



పుల్లంపేట: మాట్లాడుతున్న సూపర్‌వైజర్ మణెమ్మ



రాయచోటి రూరల్: బేటి బచావో-బేటి పడావో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అంగనవాడీలు

### కేంద్ర ప్రైవేటీకరణ విధానాన్ని ఎండగట్టాలి



నిరసన దీక్ష చేస్తున్న ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు

రాజంపేట : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానాలను వెనక్కి తీసుకోవాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మహేష్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివలు డిమాండ్ చేశారు. మంగళవారం విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలంటూ ఆ పార్టీ నాయకులు రాజంపేట సబ్ కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బలిదానాలు, త్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు కర్మగారాన్ని ప్రైవేటీపరం చేయడం దారుణమన్నారు. కేంద్రం కొందరు కార్పొరేట్ కంపెనీల కోసమే తమ విధానాలను రూపకల్పన చేస్తుండటం బాధకరమని తెలిపారు. జనవరి 27న విశాఖలో కార్మిక మహాగర్జనలో లక్షలాది మంది కేంద్ర ప్రభుత్వ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సభలో పాల్గొంటారన్నారు.

### ఫేషియల్ అటెండెన్స్‌ను రద్దుచేయాలి



రాయచోటి అర్బన్: ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు

రాయచోటి అర్బన్ : అంగన్‌వాడీ కార్యకర్తలను ముఖ ఆధారిత హాజరు నుంచి మినహాయించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పి.శ్రీనివాసులు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భాగ్యలక్ష్మిలు డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు రాయచోటి ఐసీడీఎస్ సీడీపీఓ కార్యాలయం ఎదుట ధర్నాను నిర్వహించారు. సమస్యల పరిష్కారంతోపాటు కనీస వేతనం అమలు చేయాలంటూ కోరారు. అనంతరం సీడీపీఓకు వినతి పత్రాన్ని అందజేశారు.

**కనీస వేతనమివ్వాలి**

లక్కిరెడ్డిపల్లె : అంగన్‌వాడీ వర్కర్లకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని లక్కిరెడ్డిపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు అధ్యక్షురాలు సుకుమారి పేర్కొన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ప్రభావతి, ఆంజనేయులు, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

### భూ సమస్య పరిష్కారం

చిట్వేలి : మండల పరిధిలోని కె కందులవారిపల్లి పంచాయతీ బాలాజీనగర్‌లో 20 సంవత్సరాలుగా నలుగుతున్న భూ సమస్యలను అధికారుల సహకారంతో సీపీఐ చిట్వేలి మండల శాఖ చొరవతో పరిష్కారమైంది. గ్రామం పక్కనే ఉన్న భూమి విషయమై అటు అగ్రవర్ణాలు, ఇటు దళితులు మధ్య గత 20 సంవత్సరాలుగా వివాదం కొనసాగుతోంది. ఈ విషయమై మంగళవారం రైల్వేకోడూరు సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, చిట్వేలి మండల కార్యదర్శి తిప్పన ప్రసాద్‌లు తహసీల్దార్ మురళీతో చర్చించగా వెంటనే స్పందించిన తహసీల్దార్ మండల సర్వేయర్, సచివాలయ సర్వేయర్, వీఆర్ఓ పంపించి 1.66 ఎకరాల భూమికి హద్దులు నిర్ణయించి భవిష్యత్తులో గ్రామ అవసరాలకు వినియోగించాలన్నారు. తక్షణం స్పందించిన తహసీల్దార్ మురళీకృష్ణకు సీపీఐ నాయకులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఉపాధి పనులపై సోషల్ ఆడిట్



మాట్లాడుతున్న యోగాంజనేయులరెడ్డి

సిద్దవటం : మండలంలోని 18 గ్రామ పంచాయతీలలో ఉపాధి హామీ పథకం పనులు, పెన్షన్‌లపై సోషల్ ఆడిట్ తనిఖీలు నిర్వహిస్తారని డ్వామా విజిలెన్స్ అధికారి యోగాంజనేయులరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఉపాధి హామీ పథకం 16వ విడత సామాజిక తనిఖీ సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 2021 ఏప్రిల్ నుంచి 2022 మార్చి వరకు జరిగిన ఉపాధి హామీ పనులు, పంచాయతీ రాజ్ ద్వారా జరిగిన పనులు, ఆర్‌డబ్ల్యూఎస్, అటవీశాఖ ద్వారా జరిగిన 282 పనులకు సంబంధించి రూ. 8.54 కోట్ల నిధులు ఖర్చు చేశారన్నారు. ఈ పనులకు సంబంధించి సామాజిక తనిఖీ బృందం డీఆర్‌పీలు ఆయా గ్రామ పంచాయతీలలో పనులకు సంబంధించి తనిఖీలు చేసి గ్రామ సభలు నిర్వహిస్తారన్నారు. తరువాత ఓపెన్ ఫోరం నిర్వహిస్తామన్నారు. డీఆర్‌పీలకు గ్రామ ప్రజలు ఉపాధి కూలీలు, సిబ్బంది సహకరించాలని ఆయన తెలిపారు. ఉపాధి హామీ పథకం ఏపీఓ శివశంకర్‌రెడ్డి, ఇంజనీరింగ్ కన్సల్‌టెంట్లు జగన్‌మోహన్‌రెడ్డి, వేణుగోపాల్, సోషల్ ఆడిట్ స్టేట్ రీసోర్స్‌పర్సన్ సుబ్బారావు, పీఆర్ ఏఈ సుబ్రమణ్యం, ఉపాధి హామీ టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, ప్లానిటేషన్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఉన్నతికి నిరంతర కృషి

– పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి రవీంద్రారెడ్డి



రాజంపేట రూరల్: ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి

రాజంపేట రూరల్ : పట్టభద్రుల ఉన్నతికి నిరంతరం కృషి చేయనున్నట్లు పట్టభద్రుల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. తనకు మొదటి ప్రాధాన్యతా ఓటును వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట కళాకారుల ఐక్య వేదిక అధ్యక్షుడు జె.వెంకటరెడ్డి, కౌన్సిలర్‌లు ఎస్.నవీన్‌కుమార్, పి.పెంచలయ్యనాయుడు, ఎస్‌టీయూ సంఘం ప్రతినిధి ఎం.ఆదిశేషారెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

**గోడపత్రాలను ఆవిష్కరించిన ప్రభుత్వవిప్ కొరముట్ల**

రైల్వేకోడూరు : పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు చేతుల మీదుగా గోడపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ డైరెక్టర్ సాయికిషోర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి సిడి నాగేంద్ర, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, ఉప సర్పంచ్ తోట శివసాయి, బండారు మల్లికార్జున, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైతు భరోసా కేంద్రాలు తనిఖీ చేసిన అధికారులు

నందలూరు(రాజంపేట) : ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని పలు రైతు భరోసా కేంద్రాలను మంగళవారం తనిఖీలు చేశామని రీజినల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి బి. ఉమామహేశ్వర్ తెలిపారు. వైఎస్ఆర్ జిల్లా కడప వారి ఆదేశాల మేరకు విజిలెన్స్ అధికారులైన ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీసు టి. రెడ్డెప్ప, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీసులు జి. ఇదురుబాషా, ఇ. బాలగంగాధర్‌రెడ్డి, ఏఓ జి. శ్రీనివాసులు, ఏ.జి.కెవి కిషోర్, ఏఈఈ వి. అశోక్ కుమార్‌లు తామంతా వివిధ బృందాలుగా ఏర్పడి నందలూరు మండలంలోని నందలూరు నెంబర్1, రైతు తభరోసా కేంద్రాలను, ఆడపూరు గ్రామము, చిట్వేలి మండలం లోని చిట్వేలి నెంబర్2, తిమ్మయ్య గారిపల్లె లోని రైతు భరోసా కేంద్రాలను, తనిఖీలు నిర్వహించారు. ఆర్బీకేల్లో రికార్డులను పరిశీలించారు. రైతులకు అందిస్తున్న సేవలపై ఆరాతీశారు. అనంతరం నివేదికను ఉన్నతాధికారులకు ఇస్తామని తెలిపారు.

**చిట్వేలిలో..**

చిట్వేలి : మండల పరిధిలోని చిట్వేలి-2, రైతు భరోసా కేంద్రంలో, తిమ్మయ్యగారిపల్లి రైతు భరోసా కేంద్రాలలో విజిలెన్సు అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ మేరకు మంగళవారం కడప విజిలెన్సు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆర్‌వీఈఓబీ ఉమామహేశ్వర్ ఆధ్వర్యంలో కడప విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రైతు భరోసా కేంద్రంలో సిబ్బంది పనితీరును పరిశీలించారు. ఆర్‌బీకేలలో తేలిన విషయాలను పైఅధికారులకు తెలియజేయనున్నట్లు తెలిపారు.

### క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈఓ రాఘవరెడ్డి

రాయచోటి టౌన్ : జిల్లా ఆర్‌జేయూపీ క్యాలెండర్‌ను జిల్లా విద్యాశాఖాధికారి రాఘవరెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. మంగళవారం డీఈఓ కార్యాలయంలో ఆ సంఘం నాయకులతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యాయులు రవీంద్రనాథ్‌బాబు, జిల్లా అధ్యక్షులు సిద్దయ్య, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, గౌరవ అధ్యక్షులు శ్రీనివాసులు, జిల్లా కౌన్సిలర్ బాషా, నాగరాజు, వెంకటయ్య, రెడ్డెన్న, రవి, సిద్దూ నాయక్, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

### 27న మండల సర్వసభ్య సమావేశం

రాయచోటి అర్బన్ : రాయచోటి రూరల్ మండల సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 27న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మల్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎంపీడీఓ సభా భవనంలో ఎంపీపీ పల్లపు రాజమ్మ అధ్యక్షతన సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో వివిధ సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష ఉంటుందన్నారు. అన్నిశాఖల అధికారులు పూర్తి నివేదికలతో రావాలన్నారు. సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, కో-ఆప్షన్ సభ్యులు, సర్పంచులు హాజరుకావాలంటూ కోరారు.

## పేదరిక నిర్మూలనకే సంక్షేమం



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

గోపనపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

గాలివీడు : ప్రజా సేవే పరమావధిగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని గోపనపల్లి గ్రామం, గోపనపల్లి కస్పా, శివపురంవాండ్లపల్లె, నల్లాబత్తినవాండ్లపల్లె, బండారు హరిజనవాడ, గురంవాండ్లపల్లె, సిద్దావాండ్లపల్లె, చవటగడ్డపల్లె, లక్కింవాండ్లపల్లె, గొల్లపల్లె, పూజారివాండ్లపల్లె, బొమ్మినాయుగారిపల్లి, బండక్రింద హరిజనవాడ, నక్కలవాండ్లపల్లి, చిన్నపరెడ్డిగారిపల్లెలలో గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వ పథకాలు ద్వారా చేకూర్చిన లబ్ధిని వివరించారు. సంక్షేమం బుక్‌లెట్‌ను పంపిణీ చేసి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకొని అక్కడికక్కడే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. అవ్వా, తాతలు, అక్కాచెల్లెమ్మల యోగక్షేమాలను అడిగి తెలుసుకుంటూ అండగా ఉంటామని భరోసా కల్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కులాలు, మతాలు, పార్టీలకతీతంగా పేదరికం నిర్మూలనకే అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలియజేశారు. ఎవరికైనా అర్హత ఉండి పథకం అందకుంటే వెంటనే సచివాలయం సిబ్బంది దృష్టికి తీసుకురావాలని సూచించారు. టీడీపీ హయాంలో సంక్షేమ పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీ దయాదాక్షిణ్యాలు కావాల్సి వచ్చేదని, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హులను వెతుక్కుంటూ ఇంటి ముగింటకే పథకాలు వస్తున్నాయని ప్రజలకు వివరించారు. సంక్షేమం అందిస్తున్న ముఖ్యమంత్రికి అండగా ఉంటామని మహిళలు, గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ జల్లా సుదర్శన్ రెడ్డి, వైస్ ఎంపీపీ యదుభూషన్ రెడ్డి, మార్కెట్‌కమిటీ చైర్మన్ కె.విశ్వనాథరెడ్డి, జెడ్పీటీసీ ఖాదర్ మొహిద్దీన్, ఆవుల నాగభూషణ్ రెడ్డి, రమేష్ రెడ్డి, సర్పంచ్‌లు చెన్నకేశవ రెడ్డి, ఉమాపతి రెడ్డి, ఉమాప్రభాకర్, నారే మల్లికార్జున నాయుడు, కో-ఆప్షన్ మెంబర్ నిజాం వలీ, వైస్ సర్పంచ్ చిన్న వెంకటరమణ, వాటర్ షెడ్ చైర్మన్ రమణారెడ్డి, టీసీ నాయకులు బాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు కోటిరెడ్డి, ఎస్.వెంకటరెడ్డి, అయ్యప్ప, జాకీర్ హుస్సేన్, మహబూబ్ బాషా, నజీర్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.